
అరగంట నుండి అక్కడ కాపు కాచి ఉన్నాడు చంద్రం. చాలా కంగారుగా ఉన్నాడు. ఈరోజు ఏదో ఒకటి తేల్చేయాలి. మనసు రగిలిపోతోంది. తనకేం తక్కువని! తనంటే అంత నిర్లక్ష్యం! 'మాధవి'! ఆ పేరు తలచుకుంటేనే తనకు ఆనందంగా ఉంటుంది. ఆమె రూపం చూస్తూనే తను మైమరచిపోతాడు.

ఇద్దరం ఒకే క్లాసులో ఉన్నా రోజు మొత్తంలో ఒక్కసారి కూడా తనను క్రీగంటనైనా చూడదు. ఎన్నిసార్లు వెంబడించి తన ప్రేమను తెలిపాడు ఛీకొట్టింది! ఛీదరించుకుంది! ఈ అవమానం తను భరించలేడు. ఏదైనా చేయాలి! ఇక తన ఓపిక నశించింది. అందుకే తను ఒక గట్టి నిర్ణయానికి వచ్చేశాడు. ఇవాళ ఎలాగైనా ఆమె పట్ల ప్రేమ స్థానంలో తనకు ఏర్పడిన పగను తెలియజేయాలి. అదుగో! వస్తోంది మాధవి! ఒంటరిగానే నడుచుకుంటూ వస్తోంది! ఇదే మంచి అవకాశం!

మాధవి దగ్గరకు రాగానే జేబులో నుండి చిన్న సీసా తీసి ఎడంచేత్తో మూత తీసి పట్టుకుని కుడి చేత్తో సీసా పైకెత్తాడు. మాధవి ఊహించని ఈ



# ప్రేమ-పగ

**- అబ్బరాజు జయలక్ష్మి**

సంఘటనకు బిత్తరపోయింది. భయంతో వెర్రి కేక పెట్టింది.

కాని పైకెత్తిన చంద్రం చేయి మాత్రం అలాగే ఉండిపోయింది. మాధవి అరిచినందువల్ల కాదు. వెనుకనుండి తన చేతిని కదలకుండా ఎవరో గట్టిగా పట్టుకున్నారు. తిరిగి చూసేలోపల చేతిలోనుండి సీసాను లాక్కుని ఎదురుగా వచ్చి నిలబడిన మనిషిని చూసి స్థాణువే అయ్యాడు చంద్రం.

"ఏరా! ఎంతకు తెగించావురా? అసలు నువ్వు మనిషివేనా?"

"అమ్మా!"

"అవునురా! అమ్మనే! చదువుకోమని కాలేజీకి పంపిస్తుంటే నువ్వు చేస్తున్న నిర్వాకం ఇదా! అమ్మాయిల వెంటపడి వేధించటానికి, ఇలా యాసిడ్ పోసి వాళ్ళ జీవితాలను తగులబెట్టటానికి నీకు చేతులెలా వచ్చాయిరా?"

"అమ్మా! నీకు తెలీదు. నువ్వూరుకో. ఆ బాటిల్ ఇలా ఇవ్వు."

"నోరుముయ్ వెధవా! బాటిల్ నీకిచ్చి నువ్వుచేసే ఈ నీచమైన పనిని చూస్తూ ఊరుకోమంటావా!"

"అమ్మా! నేను ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆమెలేనిదే నాకు బ్రతుకే లేదు. నా ప్రేమను అంగీకరించని తను వేరెవరితోనో సుఖంగా ఉంటే నేను భరించలేను. అందుకే..! అందుకే! నాకు దక్కనిది వేరొకరు దక్కించుకోవటానికి వీల్లేదు."

"మూర్ఖంగా మాట్లాడకు! ఇంటర్ చదివేవాడివి. నీకు ప్రేమలు కావల్సివచ్చాయా! నన్ను చూసి కూడా నువ్వు ఇంత మొండిగా ప్రవర్తిస్తున్నావంటే నీకు నిజంగా పిచ్చిపట్టింది. అసలు ప్రేమంటే ఏమిటో తెలుసా నీకు? నిజమైన ప్రేమ నిస్వార్థంగా ఉంటుంది. పగలు, ప్రతీకారాలు ఉండవు."

"అవన్నీ నాకు తెలియవు. మాధవి నన్నుకాదని అవమానపరచింది. అందుకు ప్రతిఫలం ఆమె అనుభవించాల్సిందే!"

"ఇక లాభంలేదురా! నీ రోగం కుదరాలంటే ఒకటే మార్గం." అంటూ యాసిడ్ బాటిల్ ఉన్న చేతిని పైకెత్తింది.

ఉలిక్కిపడ్డాడు చంద్రం.

"అమ్మో! అమ్మా! అమ్మా! ఆ యాసిడ్ నామీద పోస్తావా ఏమిటి? అంత పనిచేయకే నేను నీ ఒక్కగానొక్క కొడుకును నన్నేం చేయకు" అంటూ చేతులు అడ్డుపెడుతూ వెనక్కు అడుగులువేస్తూనే మనసులో ఆలోచిస్తున్నాడు.

'తన ఫ్రెండ్స్ సర్కిల్‌లో తనే అందగాడు. అందుకే అందరూ తనని 'నీకేంరా హీరోలా ఉంటావు. నిన్ను చూస్తే అమ్మాయిలందరూ పడిపోవాల్సిందే' అంటారు.

తన వయసు, మరికొంచెం హైట్ పెరిగితే సినిమాల్లో హీరో వేషాలకోసం ట్రై చేయాలనుకుంటున్నాడు. తన క్లాసులోని అమ్మాయిలందరిలోకి మాధవి అందంగా ఉంటుంది. తనకు బాగానచ్చింది. ఆరునెలలుగా తనను ప్రేమిస్తున్నాడు. తనకేం! తను అందగాడేకదా! ఆ అమ్మాయి కూడా తనను లవ్ చేయవచ్చు కదా! ఉహూ! ఎన్నిసార్లు పలకరించినా విసుక్కుంటుంది. ఒక పురుగును విదిలించినట్లు విదిలించేస్తుంది. అందుకే తన సహనం నశించింది. తను ప్రేమించిన మాధవి మరెవరినో ప్రేమించినా, పెళ్ళిచేసుకున్నా తను భరించగలడా! అందుకే ఆ అందాన్ని నాశనం చేయాలి అనుకున్నాడు.

"ఒరేయ్ చంద్రం!"

అన్న అమ్మ పిలుపుతో ఆలోచనలనుండి బయటపడి ఆమెకు దొరక్కుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

"ఒరేయ్ చంద్రం! భయపడుతున్నావా! నీ ప్రాణంలాంటిదే కదరా ఆ అమ్మాయి ప్రాణంకూడా, అయినా నిన్ను ఏంచేసినా లాభం లేదురా! నీలాంటి దుర్మార్గుడికి తల్లినయినందుకు సిగ్గుపడుతున్నానురా! నిన్ను కని నేను అపవిత్రమైపోయాను. అందుకే...నిన్ను నేను శిక్షించుకుంటున్నాను" అంటూ యాసిడ్ ఉన్న బాటిల్‌ను ఒక్కసారిగా మీద వంపేసుకుంది.

అది చూసిన చంద్రం వెంటనే "అమ్మా!"అని అరుస్తూ ఆమె చేతిలోని బాటిల్‌ను లాగి దూరంగా విసిరేశాడు. అప్పటికే ఆమె ముఖంమీద, చేతి మీద యాసిడ్ పడనేపడింది. వెంటనే అంతమేరకు బుస బుస పొంగుతూ తన పనితాను చేయటం మొదలుపెట్టింది.

బాధను పెదాలమధ్య బిగపట్టి నేలమీదకు వాలిపోయింది చంద్రం తల్లి సావిత్రమ్మ. అనుకోని ఈ సంఘటనను చూసి తట్టుకోలేని చంద్రం "అమ్మా!" అని గట్టిగా కేకపెట్టి ఆమెమీద పడి ఏడవటం మొదలుపెట్టాడు.

అప్పటివరకు జరిగేదంతా ఒక పక్కన నిలబడి భయంగా చూస్తున్న మాధవి ఊహించని విధంగా యాసిడ్ తనమీద వేసుకుని కుప్పకూలిన ఆమెను చూసి అటుగా వెళుతున్న ఆటోను ఆపి ఎక్కించింది. చంద్రం తేరుకుని ఆటో ఎక్కి అమ్మను ఒడిలో ఉంచుకుని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు. అక్కడే నిలబడి చూస్తున్న మాధవి వంక కళ్ళెత్తి చూడటానికి కూడా అతనికి ధైర్యం చాలలేదు.

❊ ❊ ❊

సావిత్రమ్మ జీవితమంతా కష్టాల బాటలోనే నడిచింది. పదహారేళ్ళకే పెళ్ళిపీటలమీద కూర్చున్న ఆమెకు భర్త పచ్చి తాగుబోతు అని కాపురానికొచ్చిన కొద్దిరోజులకే తెలిసింది. ఇంటి విషయాలేవీ పట్టించుకునేవాడు కాదు. చంద్రం పుట్టిన తరువాతైనా మార్పురాని అతనితో రోజూ నరకమే చూసింది సావిత్రమ్మ. అదేపనిగా తాగటంవల్ల లివరు దెబ్బతిని చనిపోయాడు. పుట్టింట ఎవరూ ఆదరించేవారు లేక ఆరేళ్ళ పిల్లవాడిని పెంచటానికి అష్టకష్టాలు పడింది. కూలి పని దగ్గరనుండి వంట పని వరకు అన్నిటిని చేసేది. కొడుకును కొంతవరకైనా చదివిస్తే నాలుగురాళ్ళు సంపాదించుకుని తన బ్రతుకుతను బతుకుతాడన్నదే ఆమె ధ్యాసంతా. ఎలాగో ఇంటర్‌వరకు వచ్చాడు ఇక వాడి చదువైపోయి ఉద్యోగంలో చేరితే తన కష్టాలన్నీ గట్టెక్కినట్లే అని అనుకుంటుండగా ఇలా జరిగింది.

కాలేజీలో చేరి చక్కగా చదువుకుని తనను ఉద్ధరిస్తాడని ఎదురుచూస్తుంటే ఇలాంటి పని చేస్తాడని కలలోకూడా ఊహించలేదు. సమయానికి తను అక్కడికి వెళ్ళబట్టి సరిపోయింది. లేకపోతే ఆ అమ్మాయి బ్రతుకు నాశనమయ్యేది. తను అడ్డుపడకపోతే చేసిన నేరానికి చంద్రం కటకటాల పాలయ్యేవాడు. నాకేమయినా ఫరవాలేదు. వాడు మారాలి. వాడి భవిష్యత్తు బాగుండాలి. వాడే కాదు. ఇలాంటి క్రూర మనస్తత్వం గల పిల్లలందరూ మారాలి.

పత్రికలవాళ్ళు, టి.వి. వాళ్ళు పోలీసులు అందరూ వచ్చారు. అందరికీ ఆమె ఒకటేమాట చెప్పింది.

'కొడుకు ఇలా తయారవటానికి తన అశ్రద్ధే కారణం. కాలేజికి వెళుతున్నాడు. చదువుకుంటున్నాడు అని వాడి ప్రవర్తన గురించి ప్రత్యేకంగా పట్టించుకోకపోవటంవల్లనే ఈనాడు ఈ పరిస్థితి ఏర్పడింది. తను చేసిన తప్పుకు తననుతాను శిక్షించుకున్నది. అందరూ ఇలాగే ఎవరికివారు శిక్ష వేసుకోవాలని చెప్పటం తన ఉద్దేశం కాదు. తల్లిదండ్రులు పిల్లల నడవడిని, వాళ్ళ స్నేహితులను ఎప్పటికప్పుడు గమనించి సరిదిద్దుతూ ఉండాలి" అన్నది.


**"లేదమ్మా! నేను తొందర పడలేదు. నేను కావాలనే ఇలా చేశాను. వాడికి ఈ విధంగానైనా బుద్ధిరావాలని నా ఆశ. 'ప్రేమ' 'ప్రేమ' అంటూ ఆడపిల్లల జీవితాలతో ఆడుకునే వారికి ఇది ఒక కను విప్పు కావాలి.**


ఆమె మానసిక వ్యథను అర్థంచేసుకుని వారంతా ఆమె త్వరగా కోలుకోవాలని కోరుతూ వెళ్ళిపోయారు. మర్నాడు పత్రికలలో, టి.విలలో "తనయుడిలో మార్పుకై తనపై యాసిడ్ పోసుకున్న తల్లి', 'ఓ అమ్మ సాహస కృత్యం, అమ్మాయికి తప్పిన గండం!' అంటూ సావిత్రమ్మ తెగువను పొగడుతూ వార్తలు వచ్చాయి.

❊ ❊ ❊

పదిహేను రోజులు గడిచాయి. హాస్పిటల్ నుండి ఆరోజు సావిత్రమ్మను డిశ్చార్జి చేస్తున్నారు. యాసిడ్ పడిన ప్రదేశమంతా ఇంకా బేండేజితో కట్లుకట్టి ఉన్నాయి. అదృష్టవశాత్తు ఎక్కువగా కాలనందున త్వరగానే నయమయ్యే అవకాశం ఉంది అన్నారు డాక్టర్లు.

మాధవి ఆమెను చూడటానికి వచ్చింది. ఆమె స్థానంలో తనను ఆ విధంగా ఊహించుకోవటానికే భయంగా ఉన్నది. చంద్రంమీద చాలా కోపంగా ఉన్నది. అతడు ఆరోజునుండి ఆమె కంటికి కనిపించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు.

అనుకోకుండా తండ్రికి వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ అవటంతో తనుకూడా అక్కడి కాలేజీకి షిఫ్ట్ అయింది. సావిత్రమ్మను ఆ విధంగా చూస్తుంటే తనేదో తప్పుచేసినట్లు ఆమె మనసు తపించేది.

"నావల్లనే మీకిలా జరిగింది. మీరు అనవసరంగా తొందరపడ్డారు." అన్నది మాధవి.

"లేదమ్మా! నేను తొందర పడలేదు. నేను కావాలనే ఇలా చేశాను. వాడికి ఈ విధంగానైనా బుద్ధిరావాలని నా ఆశ. 'ప్రేమ' 'ప్రేమ' అంటూ ఆడపిల్లల జీవితాలతో ఆడుకునే వారికి ఇది ఒక కనువిప్పు కావాలి. చంద్రంలాంటి కొడుకులను కన్న తల్లిదండ్రులకు ఇది ఒక గుణపాఠం కావాలి. నేను చేసిన ఈ పనివల్ల ఆడపిల్లల నూరేళ్ళ నిండు జీవితాన్ని కాలరాయాలని చూసేవారికి, యుక్తవయసులోకి అడుగుపెట్టి పెట్టకముందే అమ్మాయిల వెంటపడి వేధించేవారు ఏ ఒక్కరైనా బుద్ధితెచ్చుకుంటే అదేచాలు నాకు" అన్నది సావిత్రమ్మ.ఆమెచేసిన త్యాగానికి, ప్రదర్శించిన ధైర్యానికి చేతులెత్తి ఆమెకు నమస్కరించింది మాధవి. ★


<u>రచయిత్రి చిరునామా:</u>
**అబ్బరాజు జయలక్ష్మి**
ప్లాట్ నెం: 105,
మమతానగర్, నాగోల్,
హైదరాబాద్-69.